Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 17:12 December 2017
UGC Approved List of Journals Serial Number 49042

# విజయరాఘవనాయకుని *విప్రనారాయణచరిత్ర*: సంధి విశేషాలు

vijayarāghavanāyakuni vipranārāyaṇacaritra: sandhi viśēṣālu

Dr. Pammi Pavan Kumar, Associate Professor,
<pavankpammi@gmail.com>
Mr. Badikala Ramesh, Ph. D. Research Student,
<rameshb3622@gmail.com>
Department of Telugu, University of Hyderabad, Hyderabad – 500046, TS. India.

## 0 పరిచయం:

తెలుగు సాహిత్య చరిత్రలో దక్షిణాంధ్రయుగానికి కీలకమైన స్థానం ఉంది. ఈ యుగంలో తంజావూరు రాజ్యం ప్రాముఖ్యతను సంతరించుకొని, సాహిత్య చరిత్రలో కొత్త పాదులువేసింది. రఘునాథనాయకుని పాలన, సాహిత్య, ఆర్థికరంగాలలో మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లింది. రఘునాథనాయకుని అనంతరం అతని కుమారుడైన విజయరాఘవనాయకుడు అధికారంలోకి వచ్చి, క్రీ.శ.1633–1673 మధ్యకాలంలో పాలన సాగించాడు. ఇతడు రాజకవి. సాహిత్యానికి, సంగీతానికి ఎంతో సేవచేశాడు. తంజాపురాంధ్రనాయకుల పాలనా కాలాలలో ఇతను పాలించిన కాలం స్వర్ణయుగంగా పేరొందింది. విజయరాఘవనాయకుడు స్వయంగా 57కు పైగా రచనలు చేశాడని సాహిత్య చరిత్రలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఏడు రచనలు మాత్రం లభ్యమవుతున్నాయి.

విజయరాఘవనాయకుని కాలంలో తంజావూరిలోని తెలుగు ప్రజలు ఎంతో ఆదరణ పొందారు. తాము జీవించింది తమిళ ప్రాంతంలో అయినా, వీరంతా తెలుగు భాషను మాట్లాడినట్లు, రచనలను చేసినట్లు చారిత్రకాధారాల వల్ల తెలుస్తోంది. ఈ కాలపు రచనలలోని తెలుగు వాడుకలో ఎంతో వైవిధ్యం ఉంది. ఆ వైవిధ్యాన్ని విశ్లేషిస్తూ, విజయరాఘవనాయకుని లభిస్తున్న రచనలలోని *విప్రనారాయణచరిత్రలో* సంధి ప్రయోగాలను, విశేషాలను వివరించడానికి ఈ పత్రం పరిమితమవుతున్నది. ముందుగా *విప్రనారాయణచరిత్ర* కథాంశాన్ని సంక్షిప్తంగా పరిచయం చేయడం జరుగుతున్నది.

## 1.0 *విప్రనారాయణచరిత్ర* సంక్షిప్త పరిచయం:

*విప్రనారాయణచరిత్ర* క్రీ.శ.1652వ సంవత్సరంలో రాయబడ్డ యక్షగానం. విజయరాఘవనాయకుడు ఈ యక్షగానాన్ని రాయడానికి ముందు తెలుగులో అనేకమంది *విప్రనారాయణచరిత్ర* రాశారు. సారంగు తమ్మయ *వైజయంతి విలాసం* అనే పేరుతో *విప్రనారాయణచరిత్ర* (ప్రచురణ:2008)ను కావ్యంగానూ, చదలవాడ మల్లన

*విప్రనారాయణచరిత్రము* (ప్రచురణ:1915) అనే పేరుతో ప్రబంధంగానూ, పానుగంటి లక్ష్మీనరసింహరావు *విప్రనారాయణ* (ప్రచురణ:1994) అనే పేరుతో నాటకంగానూ రాశారు.

దక్షిణకాశిలో ఉండే విష్ణుభక్తుడైన విప్రనారాయణునికి పుణ్యక్షేత్రాల సందర్శనమంటే మక్కువ ఎక్కువ. విప్రనారాయణుడు కుటుంబం, తల్లిదండ్రులపట్ల విరక్తిచెంది, సన్యసించి, విజయరాఘవనాయకుడు పాలించే దక్షిణద్వారకలోని రాజగోపాలస్వామిని దర్శింపగోరి, పయనమై అక్కడకి వెళ్తాడు. అక్కడ రాజగోపాలస్వామి దర్శనం చేసుకొని, పూజలు నిమిత్తం అక్కడే ఆశ్రమాన్ని నిర్మించుకొని ఉంటాడు. మన్నారుగుడిలోని రాజగోపాలస్వామి విప్రనారాయణునిపై కొంత వినోదాన్ని కల్పించాలని ఒక వ్యూహం పన్నుతాడు.

ఆ వ్యూహంలో భాగంగా; దేవదేవి, సోదరీమణులు రావడం, దేవదేవి విప్రనారాయణుణ్ణి మోహించడం, విప్రనారాయణుడు దేవదేవి మాయలోపడి వారి ఇంటికి వెళ్ళడం, అక్కడ అవమానాలు పడడం మొదలైనవన్నీ జరుగుతాయి. విప్రనారాయణుడు తనకు అవమానం జరగడానికిగల కారణాన్ని తెలుసుకొని చింతిస్తాడు. తన చింతనకు కారణమైన రాజగోపాలస్వామిని చేరి, వేడుకుంటాడు. దానికి రాజగోపాలస్వామి విప్రనారాయణుని శిష్యుడి వేషం ధరించి, బంగారు గిన్నెతో తన అత్తవారింటికి రాయబారానికి వెళ్తాడు. బంగారు గిన్నె స్వీకరించిన అత్త, విప్రనారాయణుణ్ణి ఇంటికి ఆహ్వానింప కోరుతుంది. విప్రనారాయణుడు తిరిగి ఇంటికి వస్తాడు. వచ్చి, ఇంతకుముందు తన అత్తవాళ్ళు చేసిన అవమానానికి బాధపడతాడు. అంతేకాక, దేవదేవి వద్దకు వెళ్ళి, 'విష్ణునామస్మరణలో ఉన్ననన్ను మోహించి, నా తోటివారి ముందు అవమానానికి గురిచేశావు, నీకిది తగునా?' అంటూ వాపోతాడు.

విప్రనారాయణుడు యదావిధిగా మరుసటి రోజు ఉదయాన్నే లేచి, రాజగోపాలుణ్ణి దర్శించుకోవడానికి వెళ్తాడు. అప్పటికే మన్నారుగుడిలో ఉండవలసిన పంచ పాత్రలలో ఒకటైన బంగారు గిన్నె పోయిన విషయం తెలిసి, గుడిపూజారి విచారణ మొదలు పెడతాడు. ఆ బంగారు గిన్నె విప్రనారాయణుని అత్తవారింట్లో ఉందని 'దాసి'వల్ల తెలుస్తుంది. ఆ విషయం తెలిసి, గుడి అధికారులు విచారణ కోసం, దేవదేవిని, విప్రనారాయణుణ్ణి విజయరాఘనాయకుని కొలువుకి పిలిపిస్తారు. అక్కడ దేవదేవి "ఈ పరిస్థితికంతటికీ కారణం నేనే"నని జరిగిన సంఘటనలను వివరించి, కొలువులో తన తప్పును ఒప్పుకుంటుంది. ఇదంతా తిలకిస్తున్న రాజగోపాలస్వామి కొలువులో సాక్షాత్కరించి 'విప్రనారాయణుడు చాలా గొప్పవాడు. త్రిలోకాలలో పేరెన్నిక గన్నవాడు. అతనికి బంగారు గిన్నె ఒక లెక్కకాదు' అని అతనిపట్ల హితవచనాలు పలికి వెళ్ళిపోతాడు. ఈ ఘట్టంతో *విప్రనారాయణచరిత్ర* పూర్తవుతుంది.

## 1.1 *విప్రనారాయణచరిత్ర*: సంధి:

'సంధి' అనే పదానికి ప్రాచీనులు, ఆధునికులు ఎన్నో అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సంధికి ప్రధానం పదాల పొందిక, కూర్పు (సన్నికర్ష). పాణిని తన *అష్టాధ్యాయిలో* "పరఃసన్నికర్షః సంహిత" (శ్రీహరి, రవ్వా. 2015:183,184 (01.04.109)) అని సూత్రీకరించాడు. ఏవైనా రెండు వర్ణాలు అర్ధమాత్రాకాలం కంటే తక్కువ సమయంలో వ్యవధానం

లేకుండా ఉచ్చరింపబడడం సంహిత. 'సంహిత' అనే పదానికి వర్ణాల పొందిక, సామీప్యం, సన్నికర్ష (సమీపం, చేరువ) అనే అర్థాలున్నాయి. ఇంకా 'సంహిత' అంటే ఒక వర్ణానికి మరొక వర్ణానికి మధ్య ఉండే అర్ధమాత్రాకాలిక వ్యవధానం.

సంస్కృత సంధి సంప్రదాయానికి భిన్నంగా తెలుగుసంధి సంప్రదాయం ఉంటుంది. ప్రాచీన తెలుగు వ్యాకర్తలు సంస్కృత సంధిని అనుసరించే, తెలుగుసంధికి వ్యాకరణ నిర్వచనాలు రాశారు. వారిలో *ఆంధ్రభాషాభూషణం* రచించిన కేతన సంధిని...

**కం:** **'మొదలిపదము తుది వర్ణము**
**వదలక పైపదము మొదలి వర్ణముతోడన్**
**గదియగ సంధులునాఁదగు...'** (ఆం. భా. భూ.01:43) అని నిర్వచించాడు.

విన్నకోట పెద్దన తన *కావ్యాలంకారచూడామణిలో...*

**తే. గీ:** **'ఆది శబ్దాంత వర్ణంబు నంత్య శబ్ద**
**పూర్వ వర్ణంబుతోఁగూడఁబొత్తుచేత**
**సంధియగుఁగారక క్రియా సంగతములు**
**పెక్కు రూపంబులవి గానిపింతుఁదెలియ'** (కా. చూ. 1972:165 (9:45)) అని చెప్పాడు.

వీరిద్దరూ పూర్వ పదంలోని అంత్య వర్ణానికీ, పర పదాంలోని ఆది వర్ణానికీ మధ్య జరిగే క్రియను సంధిగా వ్యక్తీకరించారు. దీన్ని స్పష్టపరుస్తూ, చిన్నయసూరిగారు *బాలవ్యాకరణంలో* "పూర్వ పరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి యనంబడు" (సం. ప., సూ.01:14) అని సంధిని నిర్వచించారు. వీరి అభిప్రాయం ప్రకారం పూర్వ, పర పదాలలోని స్వరాలకు పరపదంలోని స్వరం (వర్ణం), రెండిటి స్థానంలో (ఏకాదేశంగా) నిలుస్తుంది అని అర్థం. ఈ విధానాన్నే సంధిగా వ్యక్తీకరించారు సూరి.

*ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు* అను పుస్తకంలో సంధిని "ఒక పదంలోని ధ్వనులు ఆ పదానికిగానీ లేక వాక్యంలో దాని పక్కనున్న పదాలకుగానీ చెందిన సమీపధ్వనుల వల్ల మార్పు చెందుతాయి అనేది సంధి" (సుబ్రహ్మణ్యం, పి.యస్. 2015:343) అన్నారు. చేకూరి రామారావు వంటి భాషావేత్తలు సంధికి "త్వరితోచ్చారణలో అవ్యవహితంగా వచ్చిన శబ్దాల్లో జరిగే ధ్వనులమార్పిడి సంధి" (సంపా. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014:354) అన్నారు. వీరి అభిప్రాయాలు అంగీకరించడానికి యోగ్యంగా ఉన్నాయి.

తెలుగులో సంధి జరిగే విధానాన్ని కింది పట్టికలో నిరూపించడం జరిగింది.




## 1.2 అంతస్సంధి (పదమధ్య సంధి) internal sandhi:

ధాతువు(root) లేదా ప్రాతిపదిక(stem)కి, ప్రత్యయానికి(affix) మధ్యసంధి జరిగితే దానిని అంతస్సంధి లేదా పదమధ్య సంధి(internal sandhi) అంటారు. అంటే, రెండు అర్థకాలు పదంగా రూపాంతరం చెందటం.

**ఉదా:- ధాతువు/ప్రాతిపదిక + ప్రత్యయం = పదం/పదాంశం**

1. రమ్ము + అని = రమ్మని (విప్ర.2007:34)
2. జడియు + అక = జడియక (విప్ర.2007:56)
3. వచ్చు + ఇన = వచ్చిన (విప్ర.2007:23) మొదలగునవి.

## 1.3 బాహ్య సంధి (పదాంత సంధి) external sandhi:

ఏవైనా రెండు పదాల కలయిక ఇందులో ప్రధానం. ఇది అచ్సంధి, హల్సంధి అని రెండు విధాలు. అజంత రూపాలపై జరిగే సంధి అచ్సంధి. హలంత రూపాలపై జరిగే సంధి హల్సంధి.

## 1.4 అచ్సంధి:

'అచ్చులు' ప్రధానంగా చేసుకొని జరిగే సంధి అచ్సంధి. ఈ అచ్సంధి 'అచ్చు + అచ్చు, అచ్చు + హల్లు' అన్నరీతిలో జరుగుతుంది.

### 1.4.1 అచ్చు+అచ్చు:

పూర్వ (మొదటి)పదం చివరలోనూ, పర (రెండవ)పదం మొదటిలోనూ అచ్చులే ఉన్నపుడు పూర్వపద చివరలోని అచ్చు తొలగిపోవటం లేదా అలాగే నిలిచి ఉండటం జరుగుతుంది. పూర్వపదాచ్చు తొలగిపోక అలాగే నిలిచి ఉన్న సందర్భంలో 'యడాగమం' వస్తుంది.

#### 1.4.1.1 యడాగమం:

పూర్వపదం చివరలోనూ, పరపదం మొదటిలోనూ అచ్చులే ఉన్నపుడు పూర్వపద చివరాచ్చు తొలగిపోవడం గానీ, యడాగమంగానీ వస్తుందని తెలుసుకున్నాం. చిన్నయసూరిగారు యడాగమాన్ని "సంధిలేనిచోట స్వరంబు కంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు" (బాల వ్యా., సం. ప., సూ.03:16) అని సూత్రీకరించారు. యడాగమంలో 'య్' అన్నది ఇత్సంజ్ఞ రూపంగా పరపదాదిలో వస్తుంది. ఈ దృష్టితో విజయరాఘవునాయకుని *విప్రనారాయణచరిత్ర* పరికించగా యడాగమ రూపాలు ఎక్కువగా ఉన్నాయి.

ఏ + ఊరు = ఏ + య్ + ఊరు = ఏయూరు (విప్ర.2007:28)

తార + అయ్యో = తార + య్ + య్ + అయ్యో = తారయ్యయ్యో (విప్ర.2007:49) ఈ ఉదాహరణలో యడాగమం అన్నది ద్విత్వంగా వచ్చింది.

#### 1.4.1.2 ఉత్వసంధి:

"ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు" (బాల వ్యా., సం. ప. సూ.01:15) పూర్వ పదాంతంలో ఉత్తు (ఉ – హ్రస్వ అచ్చు) ఉండి పరపదాదిలో అచ్చులేవైనా ఉన్నట్లైతే, పూర్వ పదాంతంలోని హ్రస్వ 'ఉ' లోపిస్తుంది. ఈ విధమైన దృష్టితో *విప్రనారయణచరిత్ర* చూస్తే ఉత్వసంధి నిత్యంగా (ఎల్లపుడు) జరిగింది.

**ఉదా:- పదం + పదం (word + word)**

**ఉ+అ>** వచ్చెను + అట = వచ్చెనట (విప్ర.2007:12)

**ఉ+ఆ>** నిండు + ఆరు = నిండారు (విప్ర.2007:02)

**ఉ+ఇ>** ఒప్పు + ఇంపు = ఒప్పింపు (విప్ర.2007:54)

**ఉ+ఈ>**కోర్కెలు + ఈడేరె = కోర్కెలీడేరె (విప్ర.2007:22)

**ఉ+ఉ>** ఎందు + ఉండి = ఎందుండి (విప్ర.2007:33)

**ఉ+ఊ>**నోరు + ఊరి = నోరూరి (విప్ర.2007:11)

**ఉ+ఎ>** వీడు + ఎను = వీడెను (విప్ర.2007:05)

**ఉ+ఏ>** నన్ను + ఏలు = నన్నేలు (విప్ర.2007:22)

**ఉ+ఐ>** హెచ్చు + ఐన = హెచ్చైన (విప్ర.2007:04)

**ఉ+ఒ>** చంద్రుడు + ఒక = చంద్రుడొక (విప్ర.2007:12)

**ఉ+ఔ>** పాలు + ఔనా = పాలౌనా (విప్ర.2007:45)

**పదం + పదకల్పం (word + clitic)**

కొలువు + ఐ = కొలువై (విప్ర.2007:57)

నటుడు + ఓ= నటుడో (విప్ర.2007:19)

### 1.4.1.3 అత్వసంధి:

అత్వసంధిలో మొదటి (పూర్వ), రెండవ (పర)పదాలలో మొదటిపద హ్రస్వ (చిన్న) 'అ'కి రెండవ పదాదిలో ఉన్న అచ్చుతో సంధి చేయటం జరుగుతుంది. ఈ సంధి విధానంలో మొదటి పదాంతాచ్చు వైకల్పికం (లోపించటం, లోపించకపోవటం)గా ప్రవర్తిల్లుతుంది. లోపించనపుడు చిన్నయసూరి చెప్పిన యడాగమ సూత్రం వర్తిస్తుంది.

(1) పరపదాద్యచ్చు మొదటి పదంలోని సహజ హ్రస్వ'అ'కారంతో సంధిచేయగా, మొదటిపదాచ్చు లోపించిన రూపాలు.

**అ+అ>** గన్న + అయ్య = గన్నయ్య (విప్ర.2007:22)

**అ+ఆ>** వింత + ఆయె = వింతాయె (విప్ర.2007:17)

**అ+ఇ>** తెల్లన + ఇ = తెల్లని (విప్ర.2007:45)

**అ+ఉ>** వద్దన + ఉన్న = వద్దనున్న (విప్ర.2007:32)

**అ+ఎ>** ఇంక + ఎందు = ఇంకెందు (విప్ర.2007:27)

**అ+ఏ>** అట + ఏ = అటే (విప్ర.2007:19)

**అ+ఐ>** వింత + ఐన = వింతైన (విప్ర.2007:27)

**అ+ఓ>** రార + ఓయి = రారోయి (విప్ర.2007:50)

**అ+ఔ>** ఔర + ఔర = ఔరౌర (విప్ర.2007:49) ఇది ఆమ్రేడితరూపం. అత్వసంధిలో ప్రవర్తిల్లుతుంది.

(2) పరపదాదిలో అచ్చు ఉన్నపుడు పూర్వపదంలోని సహజ హ్రస్వ 'అ'కారం లోపించని రూపాలకి యడాగమం రావడం.

**అ+అ>** కోవిల + అధికారి = కోవిల + య్ + అధికారి = కోవిలయధికారి (విప్ర.2007:50)

వేళల + అందు = వేళల + య్ + అందు = వేళలయందు (విప్ర.2007:04)

(3) వ్యతిరేక అసమాపక క్రియాపదంలో హ్రస్వ'అ'కారానికి ఉత్తు పరంకాగా 'అ'కారం లోపించింది. రచయిత *విప్రనారాయణచరిత్రలో* అసమాపక క్రియా పదాలు ఎక్కువగా ఉపయోగించలేదు.

భాషింపక + ఉన్న = భాషింపకున్న (విప్ర.2007:58)

వెడలిపోక + ఉన్న = వెడలిపోకున్న (విప్ర.2007:34)

(4) భూతకాలిక ధాతుజ విశేషణం చివరి 'అ'కారం వికల్పంగా వచ్చిన రూపాలు ఉన్నాయి.

వచ్చిన + అధికారి = వచ్చిన + య్ + అధికారి = వచ్చినయధికారి (విప్ర.2007:39)

అనిన + ఆరేయి = అనిన + న్ + ఆరేయి = అనిననారేయి (విప్ర.2007:46)

### 1.4.1.4 ఇత్వసంధి:

పూర్వపదాంతంలో ఉన్న హ్రస్వ'ఇ'కి పరపదాదిలోని అచ్చులు పరమైతే ఇత్వసంధి జరుగుతుంది. ఇత్వసంధి జరిగే సందర్భంలో పూర్వ పదాంతంలో ఉన్న 'ఇ'కారానికి సంధి కొన్నిసార్లు నిత్యంగానూ, కొన్నిసార్లు వైకల్పికంగానూ జరుగుతుంది. సంధి జరగనపుడు 'యకారం' ఆగమంగా వస్తుంది.

(1) పూర్వపదాంతంలోని ఇకారానికి పరాచ్చు పరమైనపుడు పూర్వాచ్చైన 'ఇ' వికల్పంగా లోపించిన రూపాలు *విప్రనారాయణచరిత్రలో* మచ్చుకు దర్శనమిస్తున్నాయి.

**లోపించిన రూపాలు**

**ఇ+అ>** ఉంటిని+అమ్మ=ఉంటినమ్మ (విప్ర.2007:42)

**ఇ+ఆ>** చల్లని+ఆయెను=చల్లనాయెను (విప్ర.2007:42)

**ఇ+ఇ>** అన్ని + ఇన్ని = అన్నిన్ని (విప్ర.2007:50)

**ఇ+ఉ>** కూడి + ఉండగా = కూడుండగా (విప్ర.2007:36)

**ఇ+ఎ>** రేయి + ఎల్ల = రేయెల్ల (విప్ర.2007:30)

**ఇ+ఏ>** ఏమిటికి + ఏ = ఏమిటికే (విప్ర.2007:28) 'ఏ' అనేది పదకల్పం.

**ఇ+ఐ>** పచ్చని + ఐ = పచ్చనై (విప్ర.2007:11) 'ఐ' పదకల్పం. ఇత్వానికి పదకల్పాలతో సంధి జరిగింది.

**ఇ+ఔ>** మంచివాడవి + ఔదువు = మంచివాడవౌదవు (విప్ర.2007:57)

**లోపించని రూపాలు (యకారాగమాలు)**

నీటి + ఏరు = నీటియేరు (విప్ర.2007:17)

పోరామి + ఐన = పోరామియైన (విప్ర.2007:49)

(2) "ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికముగానగు" (బాల వ్యా., సం. ప., సూ.05:18) అంటూ చిన్నయసూరిగారు ఇత్వసంధి వికల్పాన్ని చెప్పారు. *విప్రనారాయణచరిత్రలో* ఇత్వసంధి పదాల ప్రస్తావన ఉంది.

**సంధి జరిగిన రూపాలు**

ఇది + ఎన్నడు = ఇదెన్నడు (విప్ర.2007:47)

**సంధి జరగని రూపాలు (యకారాగమం)**

ఏమి + అన = ఏమి + య్ + అన = ఏమియన (విప్ర.2007:58)

(3) భూతకాలిక అసమాపక క్రియా రూపంలో ఇత్వసంధి పాటించిన విధానం *విప్రనారాయణచరిత్రలో* ఉంది. అయితే, రచయిత వ్యావహారిక కోణంలో రచన చేయడంవల్ల, ఇలాంటి రూపాలు రచనలో ఎక్కువగా ప్రయోగించలేదు.

వచ్చి + ఉన్నదయ్యా = వచ్చి + య్ + ఉన్నదయ్యా = వచ్చియున్నదయ్యా (విప్ర.2007:15)

దూరి + ఆపరిశుద్ధ = దూరి + య్ + ఆపరిశుద్ధ = దూరియాపరిశుద్ధ (విప్ర.2007:36)

(4) సమాపకక్రియలో ఇత్వం లోపించిన రూపాలు *విప్రనారాయణచరిత్రలో* ఉన్నాయి.

'తెచ్చిరి+అట=తెచ్చిరట (విప్ర.2007:55)' ప్రథమపురుష క్రియారూప పదంలో ఇత్వసంధి నిత్యం.

'వచ్చితి+అయ్య=వచ్చితయ్య (విప్ర.2007:40)' ఉత్తమపురుష క్రియారూప పదంలో ఇత్వసంధి నిత్యం.

'చూడండి+అ=చూడండ (విప్ర.2007:50)' ఇత్వసంధికి అపవాదురూపం. తమిళ ప్రభావంవల్ల జరిగింది.

### 1.4.1.5 ఎత్వసంధి:

పూర్వపదాంతమైన హ్రస్వ'ఎ'కి పరపదాదిలోని అచ్చు పరమైనప్పుడు సంధి జరిగిన రూపాలు *విప్రనారాయణచరిత్రలో* లేవు. సంధి జరగక యడాగమం వచ్చిన రూపాలు ఉన్నాయి. అంతేకాక, ఈ రచనలో విజయరాఘవనాయకుడు ఎత్వానికి సంధి కలపక పదాలను స్వతంత్రంగా ప్రయోగించాడు.

**సంధి జరగని రూపాలు(యడాగమం)**

అరుదె + ఎన్నగ = అరుదెయెన్నగ (విప్ర.2007:08)

తేనె + అంట = తేనె + య్ + అంట = తేనెయంట (విప్ర.2007:40)

### 1.4.1.6 దీర్ఘాచ్సంధి

అజంత రూపం పరమైనపుడు పూర్వపదాంతంలోని దీర్ఘాచ్చుకు, సంధిలో లోపం వర్తించదు. అందుకు బదులుగా యడాగమం వస్తుంది. ఇలాంటి రూపాలు విప్రనారాయణచరిత్రలో అరకొరగా ప్రస్తావించబడ్డాయి.

కదటవే + ఓ + అక్కా = కదటవే+వ్+ఓ+య్+అక్కా = కదటవేవోయక్కా (విప్ర. 2007:20)

కానీ + ఓ + అక్కా = కానీ+వ్+ఓ+య్+అక్కా = కానీవోయక్కా (విప్ర. 2007:18)

పై ఉదాహరణల్లో పూర్వాంత దీర్ఘాలుగా గుర్తించబడే రెండు వర్ణాలు అలాగే ఉండి, పర పదంతో సంధి చేసే క్రమంలో, వాటికి 'వ్, య్' అన్న ఆగమాలు వచ్చి చేరి, పదాలుగా ప్రవర్తిల్లాయి.

నీ + ఎలదోటకు = నీయెలదోటకు (విప్ర. 2007:26) యడాగమం.

### 1.4.2 అచ్చు + హల్లు:

మొదటి పదం చివరలోని అచ్చుకు, రెండవ పదం మొదటిలోని హల్లుకు సంధి చేయటం దీనిలో ముఖ్యోద్దేశం. ఈ విధానం త్రికసంధి రూపాలైన 'ఆ, ఈ, ఏ'లలోనూ, గసడదవాదేశ సంధిలోనూ ఎక్కువగా జరుగుతోంది.

త్రికసంధిలో 'ఆ, ఈ'లు నిర్దేశాత్మకాలను సూచించే తావులో వస్తాయి. 'ఏ' అన్నది ప్రశ్నార్థకాన్ని తెలిపే సందర్భంలో వస్తుంది. చిన్నయసూరిగారు *బాలవ్యాకరణంలో* త్రికసంధిని గూర్చి "ఆ, ఈ, ఏ అను సర్వనామంబులు

త్రికంబునాఁబడు" (బాల వ్యా., సం. ప., సూ.04:09) అంటూ త్రికాలను తెల్పుతూ ఉదాహరణ సహితంగా వివరించారు. అదేవిధంగా విజయరాఘవనాయకుని *విప్రనారాయణచరిత్రలో* త్రికసంధి జరిగిన, జరగని రూపాలు ఉన్నాయి.

### 1.4.3 త్రికసంధి:

ఆ + నగరం = అన్నగరం (విప్ర.2007:05)

ఈ + విధం = ఇవ్విధం (విప్ర.2007:04,22)

ఏ + వారి = ఎవ్వారి (విప్ర.2007:58)

**సంధి జరగని రూపాలు**

ఈ + విధంబున = ఈవిధంబున (విప్ర.2007:04,19,49)

ఈ + విధాన = ఈవిధాన (విప్ర.2007:54)

ఏ + విధంబున = ఏవిధంబున (విప్ర.2007:57)

(1) త్రికసంధికి *విప్రనారాయణచరిత్రలో* ఊష్మ, రేఫలు పరమైనపుడు సంధి జరగని రూపాలు ఉన్నాయి.

ఆ + సమయంబున = ఆసమయంబున (విప్ర.2007:48,53,29,60)

ఈ + రీతి = ఈరీతి (విప్ర.2007:51,49,56,60)

(2) త్రికసంధిలో సంధి జరగనపుడు యకారం రావడమేగాక, ద్విత్వాన్ని పొందిన రూపం ఒకటి *విప్రనారాయణచరిత్రలో* ఉంది.

ఈ + ఏటి = ఈ + య్ + య్ + ఏటి = ఇయ్యేటి (విప్ర.2007:17)

### 1.4.4 గసడదవాదేశ సంధి:

చిన్నయసూరిగారు "ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళము గానగు" (బాల వ్యా., సం. ప., సూ.13:22) అంటూ గసడదవలు ప్రవర్తిల్లే తావును లక్ష్య సమన్వితంగా వివరించారు. *విప్రనారాయణచరిత్రలో* ఈ విధానంతో కూడిన ఉదాహరణలు సంధి జరిగిన, జరగని రూపాలు ఎక్కువగా ప్రస్తావించబడ్డాయి.

**సంధి జరిగినరూపాలు (గసడదవలు ఆదేశం)**

ఎంగిలి + తిన = ఎంగిలిదిన (విప్ర.2007:38)

చీర + కట్టి = చీరగట్టి (విప్ర.2007:54)

పంద్యెము + కద్దటవే = పంద్యెముగద్దటవే (విప్ర.2007:20)

పై ఉదాహరణలో విజయరాఘవనాయకుడు తెలుగు పదాలకు అపవాదు రూపాలుగా 'పందెము' బదులుగా 'పంద్యెము'అనీ, 'కదటవే' బదులుగా 'కద్దటవే'అనీ ప్రయోగించాడు.

**సంధి జరగని రూపాలు (గసడదవలు రాకపోవడం)**

ఏలాలు + తగిలి = ఏలాలుతగిలి (విప్ర.2007:24)

గిన్నె + పోయినది = గిన్నెపోయినది (విప్ర.2007:51)

### 1.4.3.1 గసడదవాదేశసంధికి అపవాదాలు:

(1) ద్వంద్వసమాసాలలో గసడదవలు రావడం *విప్రనారాయణచరిత్రలో* కనిపిస్తోంది.

కాయ + కూరలు = కాయగూరలు (విప్ర.2007:25)

తల్లి + తండ్రులు = తల్లిదండ్రులు (విప్ర.2007:42)

(2) క్రియా పదాలమీద గసడదవలు రావడం కనిపిస్తోంది.

అరఁగు + తెచ్చిన = అరఁగుదెచ్చిన (విప్ర.2007:03)

చూచుచు + కాటుక = చూచుచుగాటుక (విప్ర.2007:58)

(3) క్త్వార్థరూపాలపై గసడదవలకు సంధి జరగకపోవడం కనిపిస్తోంది.

రాలె + తేనె = రాలెతేనె (విప్ర.2007:11)

(4) సంఖ్యావాచకానికి సంధి జరగని రూపం ఒకటి లభించింది.

నూఱు + కడవలనీరు = నూఱుకడవలనీరు (విప్ర.2007:09)

(5) అవ్యయాలమీద సంధి జరిగిన, జరగని రూపాలు *విప్రనారాయణచరిత్రలో* ఉన్నాయి.

మెదలు + కొదమ = మెదలుకొదమ (విప్ర.2007:16) సంధిలేదు

సంగతి + కలదే = సంగతిగలదే (విప్ర.2007:19) సంధి ఉంది.

(6) వ్యతిరేకక్రియా రూపంలో తద్ధర్మకంలోనూ, భవిష్యత్ అర్థకంలోనూ గసడదవలు ఉన్నాయి.

లేదు + కదరా? = లేదుగదరా? (విప్ర.2007:53)

దూరు + చేయక = దూరుసేయక (విప్ర.2007:32)

(7) ఎత్వంపై గసడదవలకు *విప్రనారాయణచరిత్రలో* సంధి పాటించబడింది.

చెల్లె + కదే = చెల్లెగదే (విప్ర.2007:31)

పుట్టదాయె + కాపురమిట్లాయె = పుట్టదాయెగాపురమిట్లాయె (విప్ర.2007:56)

**సంధి జరగని రూపం**

ఒక్కతె + చిమ్మె = ఒక్కతెచిమ్మె (విప్ర.2007:18)

### 1.4.5 అజ్లోపసంధి:

పూర్వపదాంతంలోని అచ్చుకు హల్లుపరంకాగా, అచ్చులోపిస్తుంది. చిన్నయసూరి "పదాంతంబులయి అసంయుక్తంబులైన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు" (బాల వ్యా. ఘం., ప్రకీర్ణ ప.

సూ.16:321) అనే సూత్రం ప్రకారం పూర్వ పదాంతంలోని హ్రస్వ‘ఉ’కి లోపం బహుళంగా జరుగుతుంది. *విప్రనారాయణచరిత్రలో* ఇలాంటి రూపాలు అరుదు.

తను + మూర్తి = తన్మూర్తి (విప్ర.2007:07)

కొన్ని + నాళ్ళు = కొన్నాళ్ళు (విప్ర.2007:42)

## 1.4.6 ఆగమ సంధులు:

*విప్రనారాయణచరిత్రలో* అజంతంగా ఉండి, హల్లు అగమంగా వచ్చిన రూపాలు ఎక్కువగానే ఉన్నాయి. యడాగమం, నకారాగమం వచ్చిన రూపాలు రచనలో ఎక్కువ. టుగాగమ రూపాలు అరుదు. దుగాగమానికి ఒక్క ప్రయోగం మాత్రమే లభించింది.

చిన్నయసూరి బాలవ్యాకరణంలో ‘న’కారాగమానికి “సమాసంబున నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు” (బాల వ్యా. ఘం., సం. ప., సూ.25:43), “ఉదంతంమగు తద్ధర్మార్థక విశేషణమునకచ్చు పరంబగునపుడు నుగాగమంబగు” (బాల వ్యా. ఘం., సం.ప., సూ.33:51) చెప్పారు. ఈ సూత్రాల ప్రకారం అజంతాలకు ఆగమాలు వస్తాయని లక్ష్యాలతో వివరించారు. అయితే, *విప్రనారాయణచరిత్రలో* ఉదంతాలపై నకారాగమం వచ్చిన రూపాలు విజయరాఘవనాయకుడు ఉపయోగించలేదు.

**అదంత రూపాలపై నకారాగమాలు**

సమయంబున + అధికారి = సమయంబుననధికారి (విప్ర.2007:49)

చెంగట + ఉన్న = చెంగటనున్న (విప్ర.2007:28)

**టుగాగమ రూపాలు**

‘టుక్+ఆగమం’ కిత్సంజ్ఞగా సంధిలో వస్తుంది. *విప్రనారాయణచరిత్రలో* టుగాగమ పదాలు తక్కువ.

నిడు + ఊర్పు = నిడు + ట్ + ఊర్పు = నిట్టూర్పు (విప్ర.2007:43)

మున్నీరు + అ = మున్నీట (విప్ర.2007: అను.01) వంటి పదంకూడా ఉంది.

**దుగాగమ రూపం** *విప్రనారాయణచరిత్రలో* ఒకటి ప్రయోగించబడింది.

నీ + పదంబు = నీదుపదంబు (విప్ర.2007:08)

దుగాగమాలు రాని రూపాలు కూడా ఉన్నాయి.

నీ + పాదము = నీపాదము (విప్ర.2007:27)

నా + మనసు = నామనసు (విప్ర.2007:08)

**1.5 హల్సంధి:** ఈ సంధి హల్లు + హల్లుగానూ, హల్లు + అచ్చుగానూ జరుగుతుంది. తెలుగు భాషలో హల్సంధి ద్రుతాన్ని అధారం చేసుకొని పాటించబడింది. *విప్రనారాయణచరిత్రలో* సంధిగతంగా ఉండే పూర్ణబిందువు అరుదుగా ప్రయోగించబడింది. పూర్ణబిందువు బదులు అర్థబిందువు ప్రయోగాలు ఎక్కువగా ఉన్నాయి.

### 1.5.1 ద్రుతసంధి (న్ (ఉ) + హల్లు):

ద్రుతసంధిని గూర్చి *బాల, ప్రౌఢవ్యాకరణాలలో* విపులమైన చర్చ ఉంది. వీటిలో ద్రుతం ప్రవర్తిల్లే తావులను చెప్పడం జరిగింది. చిన్నయసూరి ద్రుతానికి "నకారంబు ద్రుతంబు (బాల వ్యా. ఘం., సంజ్ఞ ప. సూ.11:08), ద్రుతాంతంబులయిన పదంబులు ద్రుతప్రకృతికములు" (బాల వ్యా. ఘం., సంజ్ఞా ప. సూ.12:08) అంటూ ద్రుతనిర్దేశాన్ని, ద్రుతప్రకృతికాలను తెలియజేశారు. ఈ ద్రుతప్రకృతికాలకు నకారాంత (వచ్చున్, వచ్చెదున్, నాకున్, నావలనన్...) పదాలను ఉదాహరణలుగా ఇచ్చారు. ద్రుతప్రకృతికాలకు సంధిజరిగే తావులో మార్పు జరుగుతుందని "ద్రుతప్రకృతికముల మీఁది పరుషములకు సరళములగు" (బాల వ్యా., సం. ప. సూ.16:24) అని సూత్రీకరించారు. ఆదేశంగా వచ్చిన సరళాలకు "ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషగానగు" (బాల వ్యా., సం. ప. సూ.17:25) అని చెప్పారు. చిన్నయసూరి అభిప్రాయాన్ని ఖండిస్తూ, బహుజనపల్లి సీతారామాచార్యులు ద్రుతాన్ని "నకారం బసాధారణంబు ద్రుతంబు" (ప్రౌఢ వ్యా., సంజ్ఞ ప. సూ.07:05) అని సూత్రీకరించారు.

*విప్రనారాయణచరిత్రలో* ఎక్కడా సంశ్లేష రూపాలు ప్రయోగించలేదు. అలాంటితావుల్లో ప్రయోగాలను అర్ధబిందు పూర్వకాలుగా ప్రయోగించారు. కొన్ని సందర్భాల్లో బిందువులుగా మారినరూపాలు ఉన్నాయి.

### (1) ద్రుతం + శ్వాసనిరుద్ధాలు (voiceless obstruents)

ద్రుతానికి శ్వాసనిరుద్ధాలు (శ్వాసస్పర్శాలైన క,ట,త,పలు, శ్వాస స్పృష్టోష్మాలైన చ,జలు) పరమైతే, అవి నాదాలు (గ,డ,ద,బ,జ)గా మారడం *విప్రనారాయణచరిత్రలో ఉంది.* వర్గయుక్కు 'ఝ'రావడం ప్రయోగించలేదు. ఈ కార్యం జరిగే సందర్భంలో ద్రుతం పరవర్ణానికి వికల్పంగా సస్థానీయానునాసికం (homorganic nasal)గా మారుతుంది. సస్థానీయానునాసికానికి పూర్వాంతంలో దీర్ఘాచ్చు ఉన్నపుడు, అనునాసికం అరసున్నగానూ, హ్రస్వాచ్చుగా ఉన్నపుడు అరసున్నగానీ, నిండుసున్నగానీ వస్తుంది.

హ్రస్వాచ్చు పూర్వక 'న్(ఉ)' పరవర్ణ సస్థానీయానునాసికంగా మార్పుపొంది నిండుసున్నగా మారిన రూపాలు.

చేయన్ + కోరి = చేయంగోరి (విప్ర.2007:09)

కనున్ + కొని = కనుంగొని (విప్ర.2007:15,18)

హ్రస్వాచ్చు పూర్వక'న్' పరవర్ణ సస్థానీయానునాసికంగామారి అరసున్నగా ప్రయోగించబడిన రూపాలు, ఈ యక్షగానంలో ఎక్కువగా ప్రయోగించబడ్డాయి.

నన్నున్ + పంచె = నన్నుఁబంచె (విప్ర.2007:42)

గుబ్బలన్ + చూసి = గుబ్బలఁజూచి (విప్ర.2007:అను.04) ఈ ఉదాహరణలో సంధి జరిగే సందర్భంలోనేకాక వ్యవహారంలో కూడా 'చూచి>చూసి'గా మారింది.

ఆసన్ + చూపి = ఆసఁజూపి (విప్ర.2007:44)

దీర్ఘాచ్చుపూర్వక 'న్(ఉ)' పరవర్ణ సస్థానీయానునాసికంగామారి అరసున్నగా మారిన రూపాలు.

లోన + పెట్టి = లోఁబెట్టి (విప్ర.2007:32)

చేయన్ + చాల = చేఁజాల (విప్ర.2007:12)

**(2) 'న్(ఉ)' + శ్వాసనిరుద్ధేతర హల్లులు**

శ్వాసాక్షరాలు (క,ట,త,ప)కానీ, శ్వాసస్పృష్టోష్మాలు కాని పరమైనపుడు న్(ఉ) వికల్పంగా లోపించటం *విప్రనారాయణచరిత్రలో* ఉంది.

**న్(ఉ) లోపించిన రూపాలు**

అజ్ఞన్ + సేయుచు = అజ్ఞసేయుచు (విప్ర.2007:09)

అంతటన్ + నిండార = అంతటనిండార (విప్ర.2007:11)

**లోపించని రూపాలు** విజయరాఘవనాయకుడు ప్రయోగించలేదు.

**(3) 'న్(ఉ)' వాక్యాంతంలో రావడం, రాకపోవడం**

ప్రత్యయాంతంతో కూడిన, ఆగమంగా వచ్చిన 'న్(ఉ)' వాక్యాంతంలో వస్తే, లోపించిన, లోపించని రూపాలు *విప్రనారాయణచరిత్రలో* ఉన్నాయి.

**లోపించిన రూపాలు**

కొలువుకువచ్చె(న్) (విప్ర.2007:14)

అప్పుడిగురిసె(న్) (విప్ర.2007:27)

**లోపించని రూపాలు**

నారాయణుండు వచ్చెను (విప్ర.2007:04)

చల్లనాయెను (విప్ర.2007:42)

## 1.5.2 అనుకృతి:

తెలుగు అనుకృతిలో సాధారణంగా 'అని' అనే ధాతురూపం ప్రయోగాల్లో ఉంటుంది. ఈ అనుకరణ అన్నది ధ్వన్యనుకరణ శబ్దాల అనుకృతి, సంస్కృత శబ్దాల అనుకృతి అని రెండు విధాలు. *విప్రనారాయణచరిత్రలో* అనుకరణ రూపాలు ప్రయోగించబడ్డాయి.

**(1) ధ్వన్యనుకరణ పదాల అనుకృతి**

ఈ అనుకరణలో ధ్వని ప్రధానంగా శబ్దాలు ప్రవర్తిల్లుతాయి. 'అను' ధాతువు గల రూపాలు *విప్రనారాయణచరిత్రలో* లభ్యం.

ఘల్లుఘల్లుమనకంచు (*విప్ర*.2007:50) 'అను>అన'గా మారింది.

కలకలమనుచు (విప్ర.2007:17)

ధ్వని ప్రధానంగా ఉండి 'అను' ధాతువు లేకుండా ప్రవర్తిల్లిన రూపాలు *విప్రనారాయణచరిత్రలో* ఉన్నాయి. వాటిలో పరరూపసంధి జరిగింది.

వింతవింతాయె (విప్ర.2007:51) 'ఆయె' పరరూపంగా స్థిరపడింది.

**(2) సంస్కృత శబ్దాల అనుకృతి**

సంస్కృత శబ్దాల అనుకృతిలో 'అను' ధాతువు వాడబడిన రూపం ఒకటి లభించింది. *విప్రనారాయణచరిత్రలో* సంస్కృత శబ్దాలకు సంధిజరగక, యడాగమం వచ్చినరూపాలు మాత్రమే లభ్యమయ్యాయి.

మండగుడి + అను = మండగుడియను (విప్ర.2007:02)

కరికరి + ఐ = కరికరి + య్ + ఐ = కరికరియై (విప్ర.2007:36)

## 1.6 హల్లు + అచ్చు

విప్రనారాయణచరిత్రలో హల్లుకి, అచ్చుకు సంధి చేసిన రూపాలు అరుదుగా ఉన్నాయి.

కైంకర్యమ్ + ఏలయా = కైంకర్యమేలయా (విప్ర.2007:38)

మొక్కన్ + ఏలయా = మొక్కనేలయా (విప్ర.2007:39)

తలవరుల్ + అధికారి = తలవరులధికారి (విప్ర.2007:51)

## 1.7 ముగింపు:

*విప్రనారాయణచరిత్ర* 17వ శతాబ్దభాషను తెలియజేస్తుంది. ఈ రచన, ప్రాచీన కాలం నుండి మార్పు పొందుతున్న తెలుగుభాషను అద్దం పట్టిచూపింది. భాషలో వర్ణాలు పొందిన మార్పు, ప్రవర్తిల్లిన తీరు, సంధి చేసిన విధానం మొదలైన విశేషాలను తెలుసుకోడానికి ఈ యక్షగానం ఎంతగానో తోడ్పడుతుంది.

## 1.8 సంకేతపదాలు:

1. ఆం. భా. భూ. = ఆంధ్ర భాషాభూషణం
2. కా. చూ. = కావ్యాలంకార చూడామణి
3. ప్రకీర్ణ ప. = ప్రకీర్ణ పరిచ్ఛేదం
4. ప్రౌఢ వ్యా. = ప్రౌఢ వ్యాకరణం
5. బాల వ్యా. = బాలవ్యాకరణం

6. బాల వ్యా. ఘం. = బాల వ్యాకరణం ఘంటాపదం

7. విప్ర. = విప్రనారాయణచరిత్ర

8. సూ. = సూత్రం

9. సంజ్ఞా ప. = సంజ్ఞా పరిచ్ఛేదం

10. సం. ప. = సంధి పరిచ్ఛేదం

## 1.9 ఉపయుక్త గ్రంథసూచి:


1. అనంతరామకృష్ణ శాస్త్రి, నేతి. 1982. ***శ్రీనాథభాషాపరిశీలన.*** గుంటూరు: అరుణా పబ్లికేషన్స్.

2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. ***తెలుగు భాషా చరిత్ర.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

3. చిన్నయసూరి, పరవస్తు. ***బాలవ్యాకరణం.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.

4. తమ్మయ, సారంగు. 2008. ***వైజయంతీవిలాసం.*** హైదరాబాదు: ఎమెస్కోబుక్స్.

5. పవన్‌కుమార్, పమ్మి. 2009. ***భాషాభూషణం (భాషా వ్యాస సంపుటి).*** హైదరాబాదు: హైదరాబాదు–విశ్వవిద్యాలయం.

6. పవన్‌కుమార్, పమ్మి. 2003. ***కట్టావరదరాజుద్విపద రామాయణం: భాషాపరిశీలన.*** హైదరాబాదు: హైదరాబాదు – విశ్వవిద్యాలయం.

7. మల్లన, చెదలవాడ. 1915. ***విప్రనారాయణచరిత్రము.*** చెన్నపట్టణం: ఆంధ్ర సాహిత్య పరిషత్తు.

8. రామారావు, చేకూరి. 2005. ***తెలుగు వాక్యం.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.

9. రామకృష్ణారావు, వంతరం. 2011. ***బాలవ్యాకరణ ఘంటాపదం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

10. రామారావు, చేకూరి. 2005. ***తెలుగు వాక్యం.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.

11. లక్ష్మీనరసింహం, పానుగంటి. 1994. ***విప్రనారాయణ (నాటకం).*** రాజమండ్రి: రోహిణిపబ్లికేషన్స్.

12. శ్రీహరి, రవ్వా. 2015. ***పాణినీయ అష్టాధ్యాయి (తెలుగు అనువాదం).*** హైదరాబాదు: తెలుగు అకాడమి.

13. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2012. ***శబ్దరత్నాకరము.*** విజయవాడ: శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో.

14. సుందరశర్మ, వి., మహదేవశర్మ, ఎ. 2007. ***విప్రనారాయణచరిత్ర.*** తంజావూరు: సరస్వతి మహల్ లైబ్రరీ.

15. సుబ్రమహ్మణ్యం, పి. యస్. 2015. ***ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.*** హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వ–విద్యాలయం.


*****